

## కాటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్‌గా 'బొమ్మినేని'

□ ముంబై కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** దేశవ్యాప్తంగా గణనీయమైన సేవలను అందిస్తూ ప్రభుత్వాల నుంచి తనకంటూ ప్రత్యేక గుర్తింపును ఏర్పరుచుకున్న కాటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ గా తెలంగాణ రాష్ట్ర కాటన్ అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మినేని రవీందర్ రెడ్డి నియమితులయ్యారు.
(మిగతా 8లో..)


# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 05 | సంచిక : 017
పేజీలు : 08 | వెల: రూ.5/-

శనివారం
డిసెంబర్ 20, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




# మల్లన్నా.. మమ్మాదరించు

నుదిటిపై బండారి.. ఘల్లు ఘల్లు గజ్జెల మోత.. ఒగ్గు పూజారుల పట్నాల సందడి.. శివసత్తుల పూనకాలు.. ఢమరుకనాధాలతో ఐనవోలు ప్రాంగణం అంతా దద్దరిల్లేందుకు సమయం ఆసన్నమైంది. పరమశువుడి ప్రతిరూపమైన మల్లికార్జునుడు భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్నారు. కోరిన కోర్కెలు నెరవేర్చే కోరమీసాల మల్లన్నగా మల్లికార్జునస్వామిని పూజిస్తారు. తెలంగాణ పల్లెల్ని ఒక్క చోట చేర్చే ఆధ్మాత్మిక వేడుక ఐనవోలు మల్లన్న జాతర. గొల్లకేతమ్మ, బలిజ మేడమ్మ సమేతంగా మల్లికార్జునుడు కొలువుదీరిన క్షేత్రం ఇది. జనవరి 13 నుంచి ప్రారంభమయ్యే ఐనవోలు జాతర భక్తకోటి సందడితో కిటకిటలాడనుంది. ఈ క్షేత్రంలో సంక్రాంతితో ఆరంభమై ఉగాది వరకుసాగే మల్లన్న బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు శనివారం హనుమకొండ కలెక్టరేట్ లో స్థానిక కలెక్టర్ స్నేహ శబరీష్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని దిశా నిర్దేశం చేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా, పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తోపాటు కుడా, దేవాదాయ శాఖ అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

– వరంగల్ వాయిస్, ఐనవోలు

వివరాలు 2లో..



## జనవరి 13 నుంచి ఐనవోలు జాతర

- భక్తుల సౌకర్యార్థం పటిష్ట ఏర్పాట్లు
- పరమశువుడి ప్రతిరూపమే మల్లికార్జునుడు
- జాతర ఏర్పాట్లపై మంత్రి కొండా సురేఖ సమీక్ష
- హాజరైన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్, కమిషనర్





8లో..

## యువజ్యోతి కాలనీకి సీసీ రోడ్డు

- శంకుస్థాపన చేసిన మంత్రి కొండా సురేఖ
- బిజీబిజీగా పర్యటన



8లో..

## జీటీఏ-మెగా కాన్ఫరెన్స్ ను విజయవంతం చేయండి

□ మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు



8లో..

## వయోవృద్ధులకు న్యాయ సేవలు

□ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ

8లో..



## డిజిటల్ చెల్లింపులకు కియోస్క్

□ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

# మల్లన్నా.. మమ్మాదరించు




- జనవరి 13 నుంచి ఐనవోలు జాతర
- భక్తుల సౌకర్యార్థం పటిష్ట ఏర్పాట్లు
- పరమశువుడి ప్రతిరూపమే మల్లికార్జునుడు
- జాతర ఏర్పాట్లపై మంత్రి కొండా సురేఖ సమీక్ష
- హాజరైన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్, కమిషనర్

**వరంగల్ వాయిస్, ఐనవోలు :** ఐనవోలు శ్రీ మల్లికార్జునస్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. జనవరి 13వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఐనవోలు జాతర ఏర్పాట్లపై హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ అధ్యక్షతన శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరు కాగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, కుడా వైస్ చైర్మన్ చాహత్ బాజ్ పాయ్ లతోపాటు దేవాదాయ, రెవెన్యూ, పోలీస్, ఆర్ అండ్ బీ, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, విద్యుత్, కుడా, మున్సిపల్, మిషన్ భగీరథ, ఇతర అధికారులు పాల్గొని వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, భద్రతతోపాటు జాతరలో ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

### విద్యుత్ దీపాల అలంకరణ..

సమీక్ష సమావేశంలో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఐనవోలు జాతర నేపథ్యంలో ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించాలన్నారు. బస్టాండ్ ఏర్పాటు చేసే ప్రాంతంలో భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు వేయాలన్నారు. అక్కడ కూడా భక్తుల కోసం తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. జాతరలో పారిశుధ్య నిర్వహణ ఎంతో ముఖ్యమని పంచాయతీ అధికారులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే పక్కనే ఉన్న గ్రామ పంచాయతీలకు సంబంధించిన సిబ్బందిని పారిశుద్ధ్య నిర్వహణకు కేటాయించాలని సూచించారు. జాతరలో ఇరవై నాలుగు గంటలు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఏ చిన్న పొరపాటు జరుగకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జాతరకు వచ్చే చిన్నపిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతం పౌష్టికాహారాన్ని అందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

### అందుబాటులో 108 వాహనాలు..

భక్తులకు ఆరోగ్య సమస్యల నుంచి రక్షణ కల్పిచేందుకు జాతర ప్రాంగణంలో వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జాతరలో 108 వాహనాలు అందుబాటులో ఉంచాలన్నారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ప్రైవేటు ఆసుపత్రులు కూడా స్వచ్ఛందంగా వైద్య సేవలు అందించే విధంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చొరవ తీసుకోవాలన్నారు.


### మహిళా సంఘాలకే స్టాల్స్..


జాతరలో మహిళా సంఘాలకు స్టాల్స్ ఏర్పాటు చేయించాలని మంత్రి కొండా సురేఖ సూచించారు. మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, అందులో మహిళలకు ప్రత్యేకంగా టాయిలెట్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు తగినన్ని ఏర్పాటు చేయాలన్నారు. అదనంగా బస్సుల ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఐనవోలు జాతర నుంచి భక్తులు కొమురవెల్లి, మేడారం జాతరకు వెళ్లే అవకాశాలు ఉన్నందున అందుకు తగినవిధంగా బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా సరైన పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జాతరకు వచ్చే భక్తులకు తగిన ముందస్తు జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. జాతరలో అనుమానితులు, దొంగతనాలు జరగకుండా పోలీసుల అప్రమత్తంగా ఉండాలన్నారు. అధిక సంఖ్యలో భక్తులు జాతరకు వస్తారని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. జాతర ఏర్పాట్లలో సంబంధిత శాఖల పనితీరును బట్టి ప్రోత్సహకాలు అందజేయాలని సూచించారు. మహిళా భక్తుల రక్షణకోసం మహిళా పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు.

### త్వరితంగా రహదారి మరమ్మతులు..

జాతర సమీపిస్తున్న దృష్ట్యా రహదారి మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని కొండా సురేఖ ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా ఇబ్బంది లేకుండా సైడ్ బర్మ్ లతో నింపాలన్నారు. ఆర్ అండ్ బీ, పోలీస్ శాఖలు సమన్వయంతో జాతరలో బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో శాశ్వత టాయిలెట్స్ నిర్మాణ పనులను పూర్తిచేయాలన్నారు. జాతర ప్రాంగణంలో అక్రమంగా మద్యం అమ్మకాలు జరగకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జాతర విశిష్టతను తెలియజేస్తూ ఎల్ఈడీ స్క్రీన్ లను ఏర్పాటు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించాలన్నారు. 24 గంటల పాటు విధులు నిర్వహించే పారిశుద్ధ్య సిబ్బందికి వారి ఆరోగ్య దృష్ట్యా మాస్కులు, భోజనం, తాగునీరు తదితర సౌకర్యాలతో పాటు అవసరమైన వారికి వైద్య సదుపాయం కల్పించాలన్నారు. నిత్యాన్నదాన కార్యక్రమంలో భక్తులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో జాతర విధులను నిర్వర్తించేందుకు ఒక వాట్సాప్ గ్రూప్ ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. జాతర విధుల్లో ఉన్న వారిని మానిటరింగ్ చేసే అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జాతరలో ఏ చిన్న సంఘటన జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత పోలీసులదే అన్నారు. ఐనవోలు జాతరను ప్రశాంతంగా నిర్వహించే విధంగా వివిధ శాఖలు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. జాతర ఏర్పాట్లు బాగుండాలన్నారు. ఐనవోలు జాతర ఏర్పాట్లను చాలెంజ్ గా తీసుకొని అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని మంత్రి కొండా సురేఖ అన్నారు.










### సమస్యలుంటే చెప్పండి : ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ ఐనవోలు జాతరలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. వీఐపీ దర్శనం పేరిట సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వీఐపీ దర్శనం కోసం రుసుమ చెల్లించిన వారికి టోకెన్లు ఇవ్వాలన్నారు. జాతరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మహిళా పోలీస్ సిబ్బందిని ఎక్కువగా కేటాయించాలని పేర్కొన్నారు. జాతరకు సంబంధించి ఏవైనా ఇబ్బందులు తలెత్తినట్లయితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అదేవిధంగా రహదారి వెంట వ్యవసాయ బావులున్నందున ప్రమాదాలు జరుగకుండా ఆర్ అండ్ బీ, పోలీసు అధికారులు సమన్వయంతో సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు సమన్వయంతో జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. మంత్రి ఆదేశాల మేరకు ప్రతి శాఖ అధికారులు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జాతర బందోబస్త్ లో పోలీస్ శాఖ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

### ఏర్పాట్లు పూర్తి చేస్తాం : కలెక్టర్ స్నేహ శబరీష్

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వివిధ శాఖల సమన్వయంతో జాతరలో మెరుగైన సౌకర్యాలు అందిచేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. వివిధ శాఖలు వారికి కేటాయించిన ఏర్పాట్లు పూర్తిచేసే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. జాతర ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. గత జాతర ఏర్పాట్లను గురించి సమీక్ష చేసి ఈ జాతర నిర్వహణలో పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, కుడా వైస్ చైర్మన్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ జాతరలో పది వాటర్ ట్యాంకర్లను జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తామని, డంపర్ బిన్లను అందుబాటులో ఉంచి పారిశుధ్య నిర్వహణ చేపడుతామన్నారు. సమీక్షా సమావేశం అనంతరం జాతర ఉత్సవాల పోస్టర్లు, పర్యాటక శాఖకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజులను శాలువాలతో సత్కరించారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖకు కలెక్టరేట్ వద్ద పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. ఈ సమావేశంలో డీసీపీ అంకిత్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్ గౌడ్, కార్యనిర్వాహణాధికారి సుధాకర్, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ‘ఓసీల సింహగర్జన’ను విజయవంతం చేయాలి

◆ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల:** హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జనవరి నెలలో నిర్వహించ తలపెట్టిన ‘ఓసీల సింహగర్జన’ మహాసభను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఓసీ జేఏసీ అధ్యక్షులు గోపు జయపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రాత్రి పరకాలలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో, వెలమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి కొలుగూరి రాజేశ్వర్ రావు అధ్యక్షతన ఓసీ కులాల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ భేటీకి రెడ్డి, వెలమ, కమ్మ, బ్రాహ్మణ, వైశ్య, మార్వాడీ సంఘాల నాయకులు భారీగా హాజరయ్యారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జయపాల్ రెడ్డి మాట్లాడుతూ, ఓసీలందరూ ఐకమత్యంగా ఉంటేనే తమ హక్కులను కాపాడుకోగలమని పేర్కొన్నారు. ప్రధానంగా ఈ క్రింది డిమాండ్లను ఆయన ప్రభుత్వం ముందుంచారు. పోరాడి సాధించుకున్న 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టాలి. జాతీయ, రాష్ట్ర స్థాయిలో వెంటనే ఓసీ కమిషన్లను ఏర్పాటు చేయాలి. ఓసీ విద్యార్థులకు టెట్ అర్హత మార్కులను 90 నుంచి 70కి తగ్గించాలి. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ జారీకి వార్షిక ఆదాయ పరిమితిని రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను నిరుపేద ఓసీలకు కూడా వర్తింపజేయాలి. జనవరిలో నిర్వహించే ఈ అగ్రకుల పేదల సదస్సులో భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని, కావున ఓసీ కుల బంధువులు వేల సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నడిపెల్లి వెంకటేశ్వరరావు, దుబ్బ శ్రీనివాస్, కామిడి సతీష్ రెడ్డి, దగ్గు తిరుపతి రావు, సూర్యదేవర సదానందం, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, శ్రీరామ్ రవీందర్, మాడుగుల పాపి రెడ్డి, బూచి ప్రభాకర్ రెడ్డి, కాటూరి రామకృష్ణమాచార్య, ఎర్ర లక్ష్మణ్, ప్రదీప్ కుమార్, అలోని ప్రశాంత్, గంటా సమ్మి రెడ్డి, సతీష్, భూపతి లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి విద్యా–వైజ్ఞానిక ప్రదర్శన–2025లో నక్కలగుట్ట వివేకానంద హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఆ పాఠశాల విద్యార్థులు దీక్షిత్, ఆరాధ్య కలిసి రూపొందించిన “మాదకద్రవ్యాల వలన కలిగే నష్టాలు” అనే అంశంపై అవగాహనాత్మక ప్రదర్శన అందరినీ ఆలోచింపజేసింది. ఈ సైన్స్ ఫెయిర్‌ను సందర్శించిన ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ విద్యార్థుల ప్రదర్శనను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల మానవ శరీరంలోని వివిధ అవయవాలకు జరిగే నష్టం, ఆరోగ్యం క్షీణించే తీరును విద్యార్థులు శాస్త్రీయంగా వివరించడం అభినందనీయం. ఈ ఎగ్జిబిట్ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన “నషాముక్తి భారత్ అభియాన్” లక్ష్యాలను ప్రతిబింబించేలా ఉందని ఆయన కొనియాడారు. డ్రగ్స్ వల్ల కేవలం వ్యక్తి మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం ఎలా కుప్పకూలుతుందో విద్యార్థులు చక్కగా వివరించారని తెలిపారు. జిల్లాలో యాంటీ డ్రగ్ టీమ్స్ మరియు పోలీసు సిబ్బంది మాదక ద్రవ్యాల నియంత్రణకు తీసుకుంటున్న గట్టి చర్యలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. యువత పెడదారి పట్టకుండా ఉండటంలో విద్యార్థుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చాటిన విద్యార్థులను, వారికి మార్గనిర్దేశం చేసిన గైడ్ టీచర్లను, పాఠశాల ప్రిన్సిపల్ పాక వెంకటేశ్వర్లును ఆయన అభినందించారు. త్వరలోనే సదరు పాఠశాలను సందర్శించి, ఈ ఎగ్జిబిట్ రూపొందించిన విద్యార్థులకు తన తరపున పుస్తకాలను బహుమతిగా అందజేయనున్నట్లు నిమ్మల శ్రీనివాస్ ప్రకటించారు.

# రేపే జాతీయ లోక్ అదాలత్

పెండింగ్ కేసులు పరిష్కరించుకోవాలి

వరంగల్ ట్రాఫిక్ సీఐ సుజాత విజ్ఞప్తి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** న్యాయస్థానాల్లో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవడానికి ఈ నెల 21న (ఆదివారం) నిర్వహించనున్న ‘జాతీయ లోక్ అదాలత్’ ఒక సువర్ణావకాశమని వరంగల్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కె. సుజాత పేర్కొన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా అన్ని కోర్టు ప్రాంగణాల్లో ఈ అదాలత్ నిర్వహించబడుతుందని ఆమె తెలిపారు. కక్షిదారులు తమపై ఉన్న కింది కేసులను తక్కువ సమయంలో, రాజీ పద్ధతిలో పరిష్కరించుకోవచ్చని ఆమె వివరించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన కేసులు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి కోర్టు పరిధిలో ఉన్న కేసులు, పెండింగ్‌లో ఉన్న ఇతర ట్రాఫిక్ చలాన్లు మరియు కేసులకు భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు తక్షణ న్యాయం లభిస్తుందని, కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ తప్పుతుందని ఇన్‌స్పెక్టర్ సుజాత తెలిపారు. ఆదివారం జరగనున్న ఈ అవకాశాన్ని ప్రజలు, కక్షిదారులు పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. “చట్టపరమైన చిక్కుల నుంచి త్వరగా బయటపడాలనుకునే వారికి రాజీ మార్గమే రాజమార్గం. పెండింగ్ కేసుల బాధితులు ఈ అవకాశాన్ని వదులుకోవద్దని సీఐ సూచించారు.

# ఫర్టిలైజర్ యాప్ నిబంధనతో రైతన్నల బెంబేలు

● తక్షణమే సడలించాలని కిషన్ రావు డిమాండ్



**వరంగల్ వాయిస్, పరకాల:** యూరియా కొనుగోలు కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘ఫర్టిలైజర్ బుకింగ్ యాప్’ సామాన్య రైతులకు శాపంగా మారిందని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికేల కిషన్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యాప్ ద్వారా బుకింగ్ తప్పనిసరి చేయడంతో గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. శనివారం పరకాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల ఇబ్బందులను ఏకరువు పెట్టారు. గ్రామాల్లో వయసు పైబడిన రైతులు, చదువుకోని రైతులకు స్మార్ట్ ఫోన్ వాడకం తెలియక, ఇంటర్నెట్ సౌకర్యం లేక యాప్ లో బుకింగ్ చేసుకోలేకపోతున్నారు. ప్రతి రైతు విడిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి రావడంతో మీ–సేవా కేంద్రాల చుట్టూ తిరగలేక సమయం, డబ్బు వృథా అవుతున్నాయి. యాప్ లో బుకింగ్ చేసుకున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో డీలర్లు సకాలంలో ఎరువులు పంపిణీ చేయకుండా రైతులను తిప్పించుకుంటున్నారని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కిషన్ రావు డిమాండ్ చేస్తూ కింది ప్రతిపాదనలను ఉంచారు. యాప్ నిబంధనను సడలించి, గతంలో లాగే నేరుగా ఎరువులు పొందే (ఆఫ్‌లైన్) వెసులుబాటు కల్పించాలి. ఒకవేళ యాప్ కొనసాగించాల్సి వస్తే, ప్రతి గ్రామంలో ఏఈఓ (AEO) లేదా పంచాయతీ సిబ్బంది ద్వారా రైతులకు ఉచితంగా బుకింగ్ సేవలు అందించాలి. బుకింగ్ చేసుకున్న రైతులకు వెంటనే ఎరువులు ఇచ్చేలా డీలర్లపై పర్యవేక్షణ పెంచాలి. యాప్ పూర్తిస్థాయిలో తెలుగులో ఉండాలని, రైతులకు దీనిపై అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే రైతులు సకాలంలో యూరియా అందక పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని, తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతులకు అండగా నిలవాలని వరికేల కిషన్ రావు హెచ్చరించారు.

# రాజీ మార్గమే రాజ మార్గం

## హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతా రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కక్షిదారులకు తక్షణ న్యాయం అందించడమే లక్ష్యంగా ఈ నెల 21న నిర్వహించనున్న ‘జాతీయ లోక్ అదాలత్’ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సీతా రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయని ఆమె పేర్కొన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా నిర్వహించబడే ఈ లోక్ అదాలత్‌లో ముఖ్యంగా మద్యం తాగి వాహనం నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడటం, కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఇతర ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు పరిష్కరించుకోవచ్చు. ఈరోజు, రేపు కక్షిదారులు తమ కేసులకు సంబంధించిన వివరాలతో లోక్ అదాలత్ ప్రతినిధులను సంప్రదించవచ్చు. భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, కోర్టుల చుట్టూ తిరిగే శ్రమను తగ్గించుకోవాలని ట్రాఫిక్ పోలీసులు కోరుతున్నారు. “చట్టపరమైన చిక్కుల నుంచి త్వరగా బయటపడటానికి లోక్ అదాలత్ ఒక అద్భుతమైన వేదిక. కక్షిదారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పెండింగ్ కేసులను పరిష్కరించుకోవాలని సీఐ సీతా రెడ్డి కోరారు.

# చర్లపల్లిలో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని చర్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం రాష్ట్ర విద్యాశాఖ అనుదేశానుసారంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ ఆదేశించినట్టుగా ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ ఎదిగే పిల్లలకు అన్ని రకాల పౌష్టికాహారాన్ని అందించినప్పుడే పిల్లల్లో ఎదుగుదల కనిపించి ఆరోగ్యంగా మానసికంగా దృఢంగా ఉంటారని ఈ సందర్భంగా తల్లిదండ్రులను కోరారు. తల్లిదండ్రులు విద్యార్థుల కోసం వివిధ రకాలైనటువంటి వంటకాలను చికెన్, చికెన్ బిర్యాని, తెలంగాణ వంటకాలు, పులిహోర గులాబ్ జామ్, సేమ్యా, పుల్కా, సర్వపిండి, నువ్వుల ముద్దలు, పల్లి పట్టీలు, పేలాల ముద్దలు, రాఫుడ్, వివిధ రకాలైనటువంటి పండ్లు తీసుకువచ్చి వారి పిల్లలకు తినిపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లకావత్ దేవా, కంచరాజు కుమార్, పుల్లూరి రామకృష్ణ , అంగన్వాడి సూపర్వైజర్ శ్రీదేవి, అంగన్వాడి టీచర్ బీముడి లక్ష్మి, సుమారు 40 మంది తల్లులు పాల్గొన్నారు.

# నేటి నుంచే యూరియా బుకింగ్ యాప్ అమలు



**వరంగల్ వాయిస్, పరకాల :** రైతులకు యూరియా పంపిణీలో పారదర్శకత పెంచేందుకు, క్యూలైన్ల ఇబ్బందులను తొలగించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘యూరియా బుకింగ్ యాప్’ శనివారం (డిసెంబర్ 20) నుంచి అందుబాటులోకి రానుంది. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని పరకాల ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె వెంకన్న కోరారు. ఈ కొత్త విధానం వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన ఈ సందర్భంగా వివరించారు. పట్టా పాస్ బుక్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా బుకింగ్ ప్రక్రియ పూర్తవుతుంది. దీనివల్ల అవకతవకలకు తావుండదు. రైతు స్వయంగా లేదా మరొకరి సహాయంతో కూడా బుక్ చేసుకోవచ్చు. రైతులు తమకు సమీపంలోని అధీకృత ఎరువుల డీలర్‌ను యాప్‌లో ఎంపిక చేసుకోవచ్చు. ఒకసారి యాప్‌లో బుక్ చేసుకుంటే, ఆ కోటా యూరియా సంబంధిత రైతు పేరు మీద రిజర్వ్ అవుతుంది. డీలర్లు దానిని ఇతరులకు విక్రయించడానికి వీలుండదు. బుక్ చేసుకున్న 24 గంటల లోపు లేదా మరుసటి రోజు దుకాణం మూసివేసే సమయానికి ఎరువులను తీసుకోవాలి. ఒకవేళ తీసుకోలేకపోతే మళ్లీ బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. ఈ యాప్ కేవలం పట్టాదార్లకే కాకుండా సాగు చేసే ప్రతి రైతుకు ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. పట్టా, ఆర్‌ఓఎఫ్‌ఆర్ పాస్ బుక్ కలిగిన రైతులు, సైన్డ్ భూములు సాగు చేస్తున్న వారు, కౌలు రైతులు కూడా ఈ యాప్ ద్వారా యూరియా పొందే సదుపాయం ఉంది. భూమి విస్తీర్ణం మరియు సాగు చేస్తున్న పంట రకాన్ని బట్టి సాఫ్ట్‌వేర్ ఆటోమేటిక్‌గా ఎన్ని బస్తాల యూరియా అవసరమో కేటాయిస్తుందని గందె వెంకన్న స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందకుండా ఈ డిజిటల్ విధానాన్ని అలవర్చుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రమాదవశాత్తు పత్తి దగ్ధం

### కన్నీరుమున్నీరవుతున్న రైతు

### పరామర్శించిన బుర్ర వెంకటేష్ గౌడ్



**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండలంలోని ఎలేటి రామయ్య పల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో ఓ రైతు తీవ్రంగా నష్టపోయారు. గ్రామానికి చెందిన రైతు పల్లవేని రమేష్ కు సంబంధించిన పత్తి నిల్వలు, ఎరువులు మరియు ధాన్యం బస్తాలు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనలో సుమారు 50,000 రూపాయల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయారు. విషయం తెలుసుకున్న భారతీయ జనతా పార్టీ చిట్యాల మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, పార్టీ శ్రేణులతో కలిసి బాధిత రైతు రమేష్‌ను పరామర్శించారు. కాలిబూడిదైన పంటను, ఎరువులను పరిశీలించి రైతుకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బుర్ర వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ, ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే బూడిద కావడం అత్యంత బాధాకరమని అన్నారు. ఇప్పటికే పత్తి ధర లేక, అకాల వర్షాలతో ఇబ్బంది పడుతున్న రైతుపై ఈ ప్రమాదం మరింత భారాన్ని మోపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి, నష్టాన్ని అంచనా వేయాలని ఆయన కోరారు. నిరుపేద రైతు రమేష్‌ను ఆదుకునేందుకు తక్షణ సహాయం కింద తగిన నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కంచ కుమారస్వామి, చింతల రాజేందర్, కేంసారపు ప్రభాకర్ తదితరులు పాల్గొని రైతుకు సంఘీభావం తెలిపారు.

# ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ ఇష్టారాజ్యం

### 15 రోజులు దాటినా అందని సిలిండర్లు

### అక్రమ విక్రయాలతో వినియోగదారుల విలవిల

### పట్టించుకోని పౌర సరఫరాల శాఖ అధికారులు



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** నర్సంపేట డివిజన్ కేంద్రంలోని స్థానిక ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల తీరు సామాన్య వినియోగదారులకు శాపంగా మారింది. గ్యాస్ సిలిండర్ల పంపిణీలో మేనేజర్ నిర్లక్ష్యం, సిబ్బంది అక్రమాలతో సామాన్యులు వంట వండుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. 15 రోజుల క్రితమే బుకింగ్ చేసుకున్నప్పటికీ, నేటికీ సిలిండర్లు సరఫరా కాకపోవడంపై వినియోగదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిలిండర్ల పంపిణీలో జరుగుతున్న ఆలస్యంపై వివరణ కోరేందుకు ఏజెన్సీ కార్యాలయానికి వెళ్తున్న బాధితులకు నిరాశే ఎదురవుతోంది. మేనేజర్ కార్యాలయంలో ఉండటం లేదని, కనీసం ఫోన్ చేసినా స్పందించడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. గంటల తరబడి ఏజెన్సీ వద్ద వేచి చూస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ వినియోగదారులకు 'స్టాక్ లేదు' అని సాకులు చెబుతున్న సిబ్బంది, తెరవెనుక అక్రమ విక్రయాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బుకింగ్ చేసుకున్న వారికి ఇవ్వాల్సిన సిలిండర్లను, ఎక్కువ ధర చెల్లించే వారికి గుట్టుచప్పుడు కాకుండా మళ్లిస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు సిబ్బంది ఏజెన్సీ మేనేజర్‌తో కుమ్మక్కై ఈ దందా సాగిస్తున్నారని, సామాన్యుల కోటాకు కోత పెడుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "గ్యాస్ బుక్ చేసి రెండు వారాలు దాటుతోంది. ఏజెన్సీ చుట్టూ తిరగలేక చస్తున్నాం. పెరిగిన ధరలతో ఇప్పటికే ఇబ్బంది పడుతుంటే, ఉన్న గ్యాస్ కూడా సకాలంలో అందకపోతే ఎలా బతకాలి?" అని స్థానిక వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పౌర సరఫరాల శాఖ అధికారులు స్పందించి, నర్సంపేట ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# నూతన ఉపాధి చట్టం ప్రతుల దహనం

### ◆ వరంగల్‌లో ఎస్ కేఎం నాయకుల నిరసన




**వరంగల్ వాయిస్, వరంగల్:** పార్లమెంట్‌లో ఇటీవల ఆమోదించిన నూతన ఉపాధి హామీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శనివారం వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో భారీ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నూతన చట్టం ప్రతులను నాయకులు దహనం చేశారు.పేదల పొట్ట కొట్టే కుట్ర: నాయకుల ఆగ్రహంఈ సందర్భంగా ఎస్కేయం జిల్లా కన్వీనర్లు మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో కనీస చర్చ లేకుండా హఠాత్తుగా ఈ బిల్లును ప్రవేశపెట్టడం గ్రామీణ పేదల ఉపాధిని దెబ్బతీసే చర్యేనని అన్నారు. రైతు సంఘాలు 200 పని దినాల కోసం పోరాడుతుంటే, ప్రభుత్వం 125 రోజులేనని ప్రకటించడం హాస్యాస్పదమని, ఇది కూడా అమలుకాని పరిస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కేంద్రం 90%, రాష్ట్రం 10% నిధులు భరించేదని, ఇప్పుడు ఆ నిష్పత్తిని 60:40 కి మార్చడం వల్ల రాష్ట్రాలపై అదనపు భారం పడుతుందని.. ఫలితంగా పేదలకు అందే అరకొర నిధులు కూడా నిలిచిపోతాయని వారు విమర్శించారు. దేశవ్యాప్తంగా దాదాపు 40 కోట్ల మంది వ్యవసాయ కూలీలు ఈ పథకంపై ఆధారపడి ఉన్నారని, ఈ చట్టం వల్ల వారంతా రోడ్డున పడతారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీని హక్కుగా గుర్తించి, ఏటా 200 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఐక్యంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్కేయం జిల్లా కన్వీనర్లు సోమిడి శ్రీనివాస్, రాచర్ల బాలరాజు, మరియు ఓదెల రాజయ్య, ఊరటి హంసల్ రెడ్డి, బొల్లు ఎల్లయ్య, బొజ్జం కమలాకర్, యారా ఐలయ్య, జక్కుల తిరుపతి పాల్గొన్నారు.

# పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** విద్యార్థుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బాల్య దశ నుంచే పౌష్టికాహారం అందించడం ఎంతో ముఖ్యమని పెంచికలపేట నూతన సర్పంచ్ మందపల్లి మరియా ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరు మండలంలోని పెంచికలపేట ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల కోసం నిర్వహించిన 'పౌష్టికాహార అవగాహన కార్యక్రమం'లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నేటి ఆహారపు అలవాట్ల వల్ల పిల్లలు అనేక రకాల ఆరోగ్య సమస్యలకు, జబ్బులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల ఆహార విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఇంటి వద్దనే సహజ సిద్ధమైన పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులు వివిధ రకాల పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. వాటిని తక్కువ ఖర్చుతో ఇంట్లోనే ఎలా తయారు చేసుకోవాలి, ఏ పదార్థంలో ఏ రకమైన విటమిన్లు, పోషకాలు ఉంటాయనే విషయాలను తల్లిదండ్రులకు కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రోజా రాణి, ఉపాధ్యాయురాలు డి.రాణి, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

### మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు శనివారం భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందిన సర్పంచ్ అభ్యర్థి చెన్నబోయిన ధనలక్ష్మి విజయ్ కుమార్ నేతృత్వంలో వార్డు సభ్యులు అనంతుల వెంకటేశ్వర్లు, సుద్దాల సురేష్, అనంతుల కిరణ్ రాజ్, బొమ్మకంటి శ్రీకాంత్, జెరిపోతుల మౌనిక మురళి తదితరులు మాజీ ఎమ్మెల్యేను కలిసి పూలమాలలతో గౌరవించారు. ఈ సందర్భంగా గండ్ర వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎన్నికల్లో ఓటమి చెందిన వారు నిరాశ చెందవద్దని ధైర్యం చెప్పారు. అస్తమించిన సూర్యుడు మళ్ళీ ఉదయించడం ఎంత నిజమో, పోరాటంలో ఓడిన వీరుడు మళ్ళీ విజయం సాధించడం కూడా అంతే నిజం. విజయం మిమ్మల్ని వరించే వరకు ప్రజల్లో ఉండి పోరాడాలి" అని ఆయన స్ఫూర్తిని నింపారు. గ్రామాభివృద్ధిలోనూ, ప్రజా సమస్యల పరిష్కారంలోనూ బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, నూతన పాలకవర్గానికి తమ పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఊరి అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యులు గుర్రం అశోక్, మాజీ సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య, ఉప సర్పంచ్ బొడకుంటి సురేష్, గ్రామ శాఖ అధ్యక్షులు భూషబోయిన సురేష్, ఉపాధ్యక్షులు బొమ్మకంటి రవీందర్, సీనియర్ నాయకులు పోశాలు, ఆనందం, సదానందం, కుమారస్వామి, చింతం రాజేందర్, వొంటేల మహేందర్, బత్తిని నరేష్, చెన్నబోయిన విద్యాసాగర్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ స్టెప్పులు

### ● సర్పంచుల సన్మాన సభలో ఉత్సాహంగా డ్యాన్స్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ శనివారం మరిపెడ మండల కేంద్రంలో సందడి చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులు ఘన విజయం సాధించిన నేపథ్యంలో నిర్వహించిన సంబరాల్లో ఆయన కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా చిందేశారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో డోర్నకల్ నియోజకవర్గవ్యాప్తంగా అనేక గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు సర్పంచులుగా గెలుపొందారు. ఈ విజయోత్సాహాన్ని పురస్కరించుకుని మరిపెడలోని ఒక ఫంక్షన్ హాల్‌లో నూతన సర్పంచులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే రామచంద్రు నాయక్, తొలుత ఖమ్మం-వరంగల్ ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సాగుతుండగా, మైకులో వినిపిస్తున్న "ఊకూకెనే రాలే బిడ్డ కూర్చున్న సీటూ..." అనే గీతానికి ఎమ్మెల్యే తనదైన శైలిలో డ్యాన్స్ చేస్తూ ప్రజలను, కార్యకర్తలను ఉత్తేజపరిచారు. రోడ్డుపై వెళ్తున్న ప్రజలకు అభివాదం చేస్తూ ఆయన చేసిన నృత్యం అందరినీ ఆకర్షించింది. తన విజయానికి కారకులైన కార్యకర్తల మధ్య ఒక సామాన్యుడిలా కలిసిపోయి ఆయన చేసిన సందడి ఇప్పుడు నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధికి నూతన సర్పంచులు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, నూతనంగా ఎన్నికైన సర్పంచులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# పూర్తైన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేయాలి

- ఎంసీపీఐ(యూ) నాయకుల డిమాండ్
- వరంగల్ కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా
- కలెక్టర్ సత్య శారదకు వినతిపత్రం అందజేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను తక్షణమే అర్హులైన పేదలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో శనివారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, నగర కార్యదర్శి మాలోత్ సాగర్ నాయకత్వంలో నిరసనకారులు కలెక్టరేట్ ముట్టడికి ప్రయత్నించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సత్య శారదను కలిసి వినతిపత్రం అందజేశారు. ధర్నానుద్దేశించి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. జిల్లాలోని దూపకుంట, తిమ్మాపూర్, లక్ష్మి టౌన్ షిప్ ఏరియాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తయినా, పేదలకు పంపిణీ చేయకుండా కాలయాపన చేయడం అన్యాయమని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో రాజకీయ లబ్ధి పొందుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, సిద్ధంగా ఉన్న ఇండ్లను పంచడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని ప్రశ్నించారు. రెండేళ్లు గడుస్తున్నా అసంపూర్తిగా ఉన్న ఇండ్లను పూర్తి చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఖాళీగా ఉన్న ఇండ్లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, వెంటనే వసతులు కల్పించి పేదలకు నిలువ నీడ కల్పించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇస్తామన్న ఇండ్లను కూడా వెంటనే కేటాయించాలని కోరారు. స్థానిక మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి పేదలకు న్యాయం చేయాలని నాయకులు కోరారు. లేనిపక్షంలో పేదలందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసనలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, సుంచు జగదీశ్వర్, ముక్కెర రామస్వామి, గణిపాక ఓదెలు, ఐతం నాగేష్, మహమ్మద్ మెహబూబ్ భాష, పరిమళ గోవర్ధన్ రాజు, మాలి ప్రభాకర్, అప్పనపురి నరసయ్య, యగ్గేని మల్లికార్జున్, తాటికాయల రత్నం బాబు, చుక్క ప్రశాంత్, యాకయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల వేలం తక్షణమే నిలిపివేయాలి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి
- లీజుకిచ్చిన భూములను వెనక్కి తీసుకోవాలి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లాలో విలువైన ప్రభుత్వ భూములను వేలం వేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ, సీపీఎం హనుమకొండ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ భూములను అమ్మి సొమ్ము చేసుకోవడం మానుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా లీజుకు ఇచ్చిన ప్రభుత్వ భూములను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అనేక ప్రభుత్వ కార్యాలయాలు, సంక్షేమ హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని.. వేలం వేయాలనుకుంటున్న స్థలాల్లో వాటికి సొంత భవనాలు నిర్మించాలని సూచించారు. ప్రభుత్వ భూములు ప్రజా ఆస్తి అని, వాటిని భావి తరాల అవసరాల కోసం పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర చైర్మన్, రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం వామపక్షాలు, ప్రజాసంఘాలు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. పౌర సమాజాన్ని కలుపుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశానికి సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.చుక్కయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఎన్.హంసారెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు నున్నా అప్పారావు, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కె.రాంచందర్, ఆదరి శ్రీనివాస్, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, నేదునూరి రాజమౌళి, ఎన్.అశోక్ స్టాలిన్, కొట్టెపాక రవి, బొట్ల చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

# 22న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ ఉత్సవాలు

- డైరీ ఆవిష్కరణ, నూతన మీటింగ్ హాల్ ప్రారంభోత్సవం
- జిల్లా అధ్యక్షుడు నరసింహా రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ తెలంగాణ హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22న నిర్వహించనున్న భారీ ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఇ.నరసింహా రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన ఈ వేడుకల వివరాలను వెల్లడించారు. డిసెంబర్ 22న ఉదయం 10 గంటల నుంచి హనుమకొండ జిల్లా కార్యాలయంలో మూడు ప్రధాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నూతన మీటింగ్ హాల్ ప్రారంభోత్సవం, ఎస్ జీపీఏటీ-2026 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ, జాతీయ పెన్షనర్స్ డే వేడుకలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా పెన్షనర్స్ ఫెడరేషన్ చైర్మన్ పీ.కే.శర్మ, జనరల్ సెక్రటరీ డి.సుధాకర్, పూర్వ చైర్మన్ ఎస్.ఎస్.దూబే, సెక్రటరీ జనరల్ జి.పూర్ణచందర్ రావు, యూపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్య దేవ్ సింగ్, రాష్ట్ర నేతలు ఎస్జీపీఏటీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.రాజేంద్ర బాబు, ఎం.వీ.నర్సింగారావు, గౌరవ అతిథులు ఏ.శ్రీనివాస్ కుమార్ (డిప్యూటీ డైరెక్టర్), టి.రాఘవరెడ్డి (ఆర్ అండ్ బి రీజినల్ ఆఫీసర్), కె.జనార్ధన్ రెడ్డి (రిటైర్డ్ సి.ఈ)లు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో పెన్షనర్లు ఎదుర్కొంటున్న జాతీయ, రాష్ట్ర స్థాయి సమస్యలపై నాయకులు విపులంగా చర్చించి, భవిష్యత్ కార్యాచరణను వివరించనున్నారు. రిటైర్డ్ ఉద్యోగులందరూ ఈ వేడుకల్లో పాల్గొని తమ ఐక్యతను చాటాలని నరసింహా రెడ్డి కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సమ్మారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు ఎల్.ప్రకాష్, చీఫ్ అడ్వైజర్ రత్నాకర్, ఆర్థిక కార్యదర్శి సూర్య ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు సింగారెడ్డి, సత్యనారాయణ, రమేష్, జ్యోతి రమణి, ప్రభాకర్ రెడ్డి, దేవదాసు, వెంకటేశ్వర్లు, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అనితా రెడ్డికి దక్కిన ప్రతిష్టాత్మక అవార్డు

## ఇంటర్నేషనల్ మనం ఫౌండేషన్ పురస్కారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సామాజికవేత్త, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్ పర్సన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డికి ప్రతిష్టాత్మకమైన "పీఎం మోదీ విజన్ ఆఫ్ భారత్-2025" అవార్డు లభించింది. ఇంటర్నేషనల్ మనం ఫౌండేషన్ వారు సామాజిక సేవా రంగంలో ఆమె చేసిన విశిష్ట కృషిని గుర్తిస్తూ ఈ అవార్డును, సర్టిఫికేట్‌ను అందజేశారు. డాక్టర్ అనితా రెడ్డి గత 30 ఏళ్లుగా నిరంతరాయంగా సాగిస్తున్న సేవా కార్యక్రమాలే ఈ అవార్డుకు ఆమెను ఎంపిక చేసేలా చేశాయని ఫౌండేషన్ చైర్మన్ తెలిపారు. అనాథ పిల్లలను, శారీరక, మానసిక దివ్యాంగులను అక్కున చేర్చుకుని, సొంత ఖర్చులతో చదివిస్తూ వారికి 'అమ్మ ప్రేమ'ను పంచుతున్నారు. పురస్కారం అందుకోవడంపై డాక్టర్ అనితా రెడ్డి స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. "ప్రధానమంత్రి మోదీ గారి విజన్‌కు ప్రతిరూపంగా ఇచ్చే ఈ అవార్డును అందుకోవడం ఊహించని గౌరవం. ఇది నాపై బాధ్యతను మరింత పెంచింది. మా సేవా కార్యక్రమాల్లో ఆర్భాటాలకు తావుండదు, కేవలం అవసరార్థులకు స్వచ్ఛమైన సేవలు అందించడమే మా లక్ష్యం. భవిష్యత్తులో మరిన్ని సామాజిక హిత కార్యక్రమాలు నిర్వహిస్తాను" అని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం డాక్టర్ అనితా రెడ్డి వరల్డ్ వైజ్ కన్జుమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ చైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమెకు అవార్డు దక్కడంపై పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు అభినందనలు తెలిపారు.

# ఎమ్మెల్సీ బల్మూరిని కలిసిన మడిపల్లి కాంగ్రెస్ నాయకులు



**వరంగల్ వాయిస్, ఇల్లందకుంట :** హుజురాబాద్ నియోజకవర్గంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించిన నూతన సర్పంచుల సన్మానోత్సవ కార్యక్రమం శనివారం ఇల్లందకుంటలో వైభవంగా జరిగింది. అపర భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ మండపంలో జరిగిన ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, శాసనమండలి సభ్యులు బల్మూరి వెంకట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం మరియు గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి ఈ సందర్భంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో మడిపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఉప్పుల సాంబశివరెడ్డి, మాజీ సర్పంచ్ నేరెళ్ల సదానందం గౌడ్, సీనియర్ నాయకులు ఓల్లాల శ్రీనివాస్ గౌడ్, గంగారపు రఘుబాబు, అంబాల రాజు, చెన్నబోయిన రమేష్, ఒగ్గు కుమారస్వామి, నాగపూరి శ్రీనివాస్ గౌడ్, మైనార్టీ నాయకులు మహమ్మద్ సందాని తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్ష




**వరంగల్ వాయిస్,చిట్యాల :** ప్రముఖ భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శనివారం చిట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీరామ్ రఘుపతి, మండల గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు ఎస్.రామ్ నారాయణ నేతృత్వంలో జరిగిన ఈ పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో తార్కిక ఆలోచనను, గణితంపై ఆసక్తిని పెంపొందించేందుకు నిర్వహించిన ఈ పరీక్షలో కింది విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. ప్రథమ స్థానం కె.సంజన, ద్వితీయ స్థానం కె.తేజ కుమార్, తృతీయ స్థానంలో జె.సౌమిత్ లు నిలిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంజిత్, లక్ష్మీపతి, కోటేష్, మమత, రాజమౌళి పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎంపీడీవోకు పంచాయతీ కార్యదర్శుల సన్మానం



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో రెండో విడత సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలను అత్యంత విజయవంతంగా పూర్తి చేసినందుకు గాను, మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ఏ.రవీంద్రనాథ్ ని శనివారం పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలో ఆయనను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కాళేశ్వరం పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ ఎంపీడీవో పనితీరును కొనియాడారు. రిజర్వేషన్ల ప్రక్రియ నుండి ఎన్నికల ఫలితాల వరకు ఎంపీడీవో గారు నిరంతరం అందుబాటులో ఉంటూ సిబ్బందిని అప్రమత్తం చేశారని తెలిపారు. సన్మానం అనంతరం ఎంపీడీవో రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. సిబ్బంది అందరి సమష్టి కృషి వల్లనే ఎన్నికలు ప్రశాంతంగా, విజయవంతంగా ముగిశాయని తెలిపారు. ఇదే స్ఫూర్తిని రాబోయే ఎంపిటీసీ, జడ్పిటీసీ ఎన్నికలలో కూడా కొనసాగించి, మహాదేవపూర్ మండలాన్ని జిల్లాలోనే ఆదర్శంగా నిలుపుదామని పిలుపునిచ్చారు. పంచాయతీరాజ్ డీఈ రవీందర్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, మంజూరు నవాజుద్దీన్, కుమారస్వామి, రమేష్, సురేష్, మహేష్, కల్పన, గాయత్రి, స్వాతి, ఇందిర, కార్యాలయ సిబ్బంది అరుణ్, శ్రీకాంత్, శ్రీహరి, శ్రీనివాస్, రాజయ్య పాల్గొన్నారు.

# నైన్ పాక పాఠశాలలో 'ఫుడ్ ఫెస్టివల్'



**వరంగల్ వాయిస్, పరకాల:** మండలంలోని నైన్ పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం అత్యంత ఉత్సాహంగా జరిగింది. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్.ఊర్మిళ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు స్వయంగా తయారు చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలతో కూడిన 'ఫుడ్ ఫెస్టివల్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమ్యూనిటీ మొబిలైజర్ ఆఫీసర్ ఎస్.రమేష్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పి.విజయపాల్ రెడ్డి హాజరై, విద్యార్థులు సిద్ధం చేసిన ఆహార ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన వంటకాలను రుచి చూసి, వారి నైపుణ్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ చల్లా కిషన్ రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు సుధాకర్, ప్రణీత, ప్రవీణ్ కుమార్, రాజయ్య, రఘు, ప్రసాద్, కోటేశ్వరరావు, లోక శ్రీనివాస్, విజయవర్ధన్ రెడ్డి, ఓదెలు, సీఆర్పీ తిరుపతి, పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఐకి వెంకటేశ్వర్లపల్లి సర్పంచ్ సన్మానం




**వరంగల్ వాయిస్, పరకాల :** హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలో శనివారం కమలాపూర్ మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామ నూతన సర్పంచ్ పెండ్యాల మహేందర్ రెడ్డి, పరకాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ మరియు పోలీసుల సహకారంపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేందర్ రెడ్డి, నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు సీఐని పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో పోలీసుల పాత్ర కీలకమని, సమన్వయంతో ముందుకెళ్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. సీఐ స్పందిస్తూ నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌కు, వార్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ, శాంతిభద్రతల విషయంలో పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.


# అసంపూర్తి రోడ్డుతో నరకప్రాయం

◆ రేపాక గ్రామస్తుల 'రాస్తారోకో'



**వరంగల్ వాయిస్, రేగొండ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రేపాక గ్రామంలో రోడ్డు పనుల నత్తనడకపై గ్రామస్తుల సహనం నశించింది. గత ఏడాది కాలంగా అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను నిరసిస్తూ శనివారం గ్రామ ప్రజలు, యువకులు, ఆటో డ్రైవర్లు చిట్యాల–రేగొండ ప్రధాన రహదారిపై మహా ధర్నా నిర్వహించారు. సుమారు అరగంటకు పైగా రోడ్డుపై బైఠాయించడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. గ్రామస్తులు తమ గోడును వెళ్లబోస్తూ.. రేపాక గ్రామం నుంచి రైతువేదిక వరకు రోడ్డు నిర్మిస్తామని చెప్పి, ఏడాది క్రితం కంకర పోసి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై కంకర, మొరం వేసి వదిలేయడంతో వాహనాలు స్కిడ్ అయి ఎంతోమంది గాయపడ్డారని, ప్రయాణం ప్రాణసంకటంగా మారిందని మండిపడ్డారు. వాహనాలు వెళ్లేటప్పుడు లేస్తున్న దుమ్ము కారణంగా ఇళ్లలో ఉండలేకపోతున్నామని, దుకాణదారులు, వాహనదారులు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పనులు పూర్తయ్యే వరకు దుమ్ము లేవకుండా రోజుకు కనీసం ఐదుసార్లు వాటర్ ట్యాంకర్ల ద్వారా రోడ్డుపై నీళ్లు చల్లాలి. తమకు సీసీ రోడ్డు వద్దని, నాణ్యమైన తారు రోడ్డును వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై అధికారులు చర్యలు తీసుకుని, యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయించాలి. అధికారులు, పాలకులు ఇప్పటికైనా స్పందించకుంటే రెండు రోజుల్లో రేగొండ మండల కేంద్రంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని గ్రామ ప్రజలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా గ్రామస్తులు, యువకులు, ఆటో కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని తమ నిరసన గళాన్ని వినిపించారు.

# ముగిసిన ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది శిక్షణ



**వరంగల్ వాయిస్, మామునూరు :** మామునూరులోని 4వ బెటాలియన్ ప్రాంగణంలో గత నెల రోజులుగా 7వ బెటాలియన్‌కు చెందిన 100 మంది ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు 4వ బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి, 7వ బెటాలియన్ కమాండెంట్ సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బందిని ఉద్దేశించి కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎక్కడైనా ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రజలను కాపాడటమే ఈ దళం ప్రధాన విధి అని పేర్కొన్నారు. శిక్షణలో భాగంగా సిబ్బందికి కింది అంశాలపై నిష్ణాతులచే తర్ఫీదు ఇచ్చినట్లు తెలిపారు. అత్యవసర సమయంలో ప్రాథమిక చికిత్స అందించడం, కూలిపోయిన భవనాల శిథిలాల నుంచి ప్రజలను వెలికితీయడం, భారీ లోయలు, భవనాల పైనుంచి తాళ్ల సహాయంతో రక్షించడం, విపత్తు నిర్వహణలో అధునాతన పద్ధతులు, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి బెటాలియన్‌లో 100 మందితో కూడిన ప్రత్యేక ఎస్డీఆర్ఎఫ్ బృందాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆయన వివరించారు. ఇప్పటికే మామునూరు, 17వ బెటాలియన్ సిబ్బందికి ఈ శిక్షణ పూర్తి కాగా, తాజాగా 7వ బెటాలియన్ సిబ్బంది తమ 30 రోజుల కఠిన శిక్షణను విజయవంతంగా ముగించుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 4వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్స్ కృష్ణ ప్రసాద్, పి.శ్రీనివాసరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు విజయ్, రవి, సర్వర్, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లతో పాటు 7వ బెటాలియన్ ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# షైన్ స్కూల్‌లో అలరించిన 'విద్యాస్త్ర – స్కల్ప్ట్ ద ఫ్యూచర్'



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** శివనగర్‌లోని షైన్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన 'విద్యాస్త్ర – స్కల్ప్ట్ ద ఫ్యూచర్' కార్యక్రమం విద్యార్థుల ప్రతిభాపాటవాలకు వేదికగా నిలిచింది. 'ఐ విల్ టీచ్ మై లెసన్' అనే ఇతివృత్తంతో జరిగిన ఈ ప్రదర్శనలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధిస్తూ తమలోని సృజనాత్మకతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో, వినూత్న బోధనా పద్ధతులతో వీక్షకులను మంత్రముగ్ధులను చేశారు. విద్యార్థుల నైపుణ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని చూసి తల్లిదండ్రులు, సందర్శకులు హర్షం వ్యక్తం చేశారు. కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా, ప్రాక్టికల్ విజ్ఞానాన్ని విద్యార్థులు ప్రదర్శించిన తీరు వర్ణనాతీతంగా ఉందని వీక్షకులు కొనియాడారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్, డైరెక్టర్ మూగల రమ విద్యార్థుల ప్రదర్శనను స్వయంగా వీక్షించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే ఇటువంటి కార్యక్రమాల ఉద్దేశమని పేర్కొన్నారు. విద్యార్థుల 'ఆల్ రౌండ్ డెవలప్‌మెంట్' (సర్వతోముఖాభివృద్ధి) కోసం షైన్ విద్యాసంస్థలు నిరంతరం కృషి చేస్తాయని హామీ ఇచ్చారు. భావి తరాలను తీర్చిదిద్దే క్రమంలో ఇటువంటి ప్రయోగాత్మక విద్య ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈ వేడుకలో పాఠశాల ప్రిన్సిపల్ బయ్య మానస, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజకీయాల్లో మౌనిక ఉన్నత స్థాయికి ఎదగాలి

■ పెరిక కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి విజయ్ కుమార్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ జిల్లా గీసుకొండ మండలం చంద్రయ్యపల్లి గ్రామ సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వుగ్గె మౌనిక–ప్రశాంత్ దంపతులను పెరిక కుల సంఘం (766/2014) రాష్ట్ర నాయకత్వం ఘనంగా సన్మానించింది. శనివారం హనుమకొండ బాలసముద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కుల సంఘం ప్రతినిధులు ఆమెను పూలమాలలు, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పెరిక కుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కీత విజయ్ కుమార్ మాట్లాడుతూ.. అతి చిన్న వయసులోనే ఏకగ్రీవంగా సర్పంచిగా ఎన్నిక కావడం మౌనిక నాయకత్వ పటిమకు నిదర్శనమని కొనియాడారు. గ్రామ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మంచి సేవలు అందించి, భవిష్యత్తులో రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. సామాజిక సేవలోనూ, పెరిక కుల సంఘాభివృద్ధిలోనూ ఉగ్గె కుటుంబం చురుకైన పాత్ర పోషించాలని ఆయన కోరారు. పెరిక కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గటిక విజయ్ కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు సుంకరి ఆనంద్ ఫోన్ ద్వారా మౌనిక–ప్రశాంత్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలని, మౌనిక విజయం మహిళాలోకానికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెరిక కుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు అల్లం రాజేశ్ వర్మ, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రామినేని రాజేష్, మాజీ వైస్ ఎంపీపీ ఉగ్గె సాంబయ్య, విశ్రాంత ఉద్యోగి చింతం సారంగపాణి, గీతాంజలి వేణుమాధవ్, బుద్దె గణేశ్, పెరిక ధాత్రి ఎడిటర్ బరుపటి సంపత్, తీర్థాల పురుషోత్తం, హనుమకొండ పెరిక పరపతి సంఘం అధ్యక్షుడు నల్లపు కోటేశ్వర్, వరంగల్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు మంచాల రాజు, దొమ్మటి శ్రీకాంత్ పాల్గొన్నారు. అలాగే కుల నాయకులు వనపర్తి ధర్మరాజు, సుంచు వీరన్న, ఏసిరెడ్డి ప్రభాకర్, అంకతి అభిలాష్, చిట్టిబొమ్మల భిక్షపతి తదితరులు పాల్గొని సర్పంచిని అభినందించారు.

# ఆనాటి ఘటనలు తలచుకుంటేనే భయమేస్తోంది

**నటి రాధికా ఆప్టే సంచలన వ్యాఖ్యలు**

బాలీవుడ్‌తో పాటు సౌత్ చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి రాధికా ఆప్టే. సినీ రంగంలో తన ఇరవై ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న వివక్ష అలాగే బాడీ షేమింగ్ గురించి ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆ రోజులు గుర్తుకు వస్తే ఇప్పటికీ తన గుండె ఆగిపోయినంత పని అవుతుందని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా 2000వ దశకం చివరలో ఆర్థిక ఇబ్బందుల వల్ల కొన్ని దక్షిణాది సినిమాల్లో నటించాల్సి వచ్చిందని, అప్పుడు షూటింగ్ సెట్స్‌పై ఉన్న పరిస్థితులు అత్యంత దారుణంగా ఉండేవని ఆమె పేర్కొన్నారు. ఒక చిన్న ఊరిలో జరిగిన షూటింగ్ సమయంలో సెట్ అంతా మగవారే ఉండేవారని, అక్కడ తన శరీరాకృతి గురించి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసేవారని రాధిక వెల్లడిరచారు. సెట్‌లో ఉన్నవాళ్లు నా బమ్స్ మరియు బ్రెస్ట్స్ దగ్గర ప్యాడిరగ్ పెంచమని అడిగేవారు. 'అమ్మా.. మోర్ ప్యాడిరగ్' అని పిలిచేవారు. ఆ మాటలు విన్నప్పుడు తనకు నవ్వాలో ఏడవాలో అర్థమయ్యేది కాదని రాధికా వాపోయింది. అప్పట్లో తనకు రక్షణగా మేనేజర్లు, ఏజెంట్లు ఎవరూ లేకపోవడంతో ఒంటరిగా ఆ మానసిక వేదనను అనుభవించానని, ఆ పరిస్థితులు తనను ఇప్పటికీ మానసిక గాయానికి గురిచేస్తాయని ఆవేదన చెందారు. హిందీ పరిశ్రమలో కూడా కొందరు ప్రభావవంతమైన వ్యక్తుల ప్రవర్తన నచ్చక తానంతట తానే పెద్ద ప్రాజెక్టుల నుంచి తప్పుకున్నానని, ఒకవేళ వారి పేర్లు బయట పెడితే ప్రపంచమంతా షాక్ అవుతుందని ఆమె తెలిపింది. పరిశ్రమలో ఉన్నత స్థాయిలో ఉన్న మహిళలు కూడా వ్యవస్థను మార్చడానికి ప్రయత్నించకపోవడం విచారకరమని అభిప్రాయపడిన రాధికా ఆప్టే, ప్రస్తుతం తన తాజా చిత్రం 'సాలీ మొహబ్బత్' జీ5లో స్ట్రీమ్ అవుతున్న సందర్భంగా ఈ విషయాలను పంచుకుంది.





## బిర్యానీ పాత్రలో సంపూర్ణేష్ బాబు

నేచురల్ స్టార్ నాని, 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి ఒక షాకింగ్ అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో 'బర్నింగ్ స్టార్' సంపూర్ణేష్ బాబును ఒక సరికొత్త ఊర మాస్ అవతారంలో శ్రీకాంత్ ఓదెల చూపించబోతున్నాడు. ఎప్పుడూ తనదైన కామెడీతో నవ్వించే సంపూర్ణేష్ బాబును దర్శకుడు శ్రీకాంత్ ఓదెల పూర్తిగా మార్చేశాడు. 'ది ప్యారడైజ్' చిత్రంలో సంపూ 'బిర్యానీ' అనే మాస్ పాత్రను పోషిస్తున్నారు. శుక్రవారం విడుదలైన ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పోస్టర్‌లో సంపూర్ణేష్ బాబు ఒంటి నిండా రక్తపు మరకలతో, భుజాన గొడ్డలి వేసుకుని, బీడీ తాగుతూ చాలా సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన కళ్లలో కనిపిస్తున్న క్రూరత్వం చూస్తుంటే, ఇందులో ఆయన కేవలం కామెడీకి పరిమితం కాకుండా ఒక పవర్‌ఫుల్ పాత్ర చేస్తున్నట్లు అర్థమవుతోంది. ఈ చిత్రంలో హీరో నాని (జడల్) కి అత్యంత సన్నిహితుడైన స్నేహితుడిగా, ప్రాణమిచ్చే నమ్మకస్థుడిగా 'బిర్యానీ' పాత్ర ఉండబోతోంది. ఈ పాత్ర కోసం సంపూర్ణేష్ బాబు చాలా బరువు తగ్గి, తన బాడీ లాంగ్వేజ్‌ను కూడా పూర్తిగా మార్చుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ర్శకుడు శ్రీకాంత్ ఓదెల తన సినిమాల్లో పాత్రలను చాలా సహజంగా, గంభీరంగా చూపిస్తారు. 'దసరా'లో కమెడియన్లను కూడా సీరియస్ పాత్రల్లో చూపించినట్లుగానే, ఇప్పుడు సంపూ లోని యాక్షన్ యాంగిల్‌ను బయటకు తీయబోతున్నారు. 'హైదరాబాద్ నేపథ్యంలో సాగే కథలో 'బిర్యానీ' లేకుండా ఉండదు' అంటూ ఈ పాత్రను ఇంట్రడ్యూస్ చేసిన తీరు వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో నానితో పాటు, మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ఈ సినిమా 2026 మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా 8 భాషల్లో (తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్) గ్రాండ్‌గా విడుదల కానుంది.




## వెన్నులో వణుకు పుట్టించేలా..

**25న వస్తున్న హారర్ థ్రిల్లర్**

త్రిగుణ్, హెబ్బాపటేల్ కీలక పాత్రల్లో రానున్న హారర్ థ్రిల్లర్ 'ఈషా'. శ్రీనివాస్ మన్నె దర్శకుడు. ఆ హారర్ థ్రిల్లర్ డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో విడుదలకు మందు ఆసక్తికరమైన వీడియోను టీమ్ పంచుకుంది. ఆత్మ అంటే అదేనేమో అంటూ హీరోయిన్ చెప్పే డైలాగు భయపెట్టేలా ఉంది. ఇటీవల 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' వంటి వరుస కల్ట్ హిట్స్ అందించిన సక్సెస్‌ఫుల్ జోడీ బన్నీ వాస్, వంశీ నందిపాటి. కలిసి ఇప్పుడు ప్రేక్షకులకు ఒక క్రేజీ హారర్ అనుభూతిని పంచడానికి సిద్ధమయ్యారు. వీరి సరికొత్త హారర్ థ్రిల్లర్ 'ఈషా' డిసెంబర్ 25న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ చిత్రం గురించి మేకర్స్ తాజాగా 'వార్నింగ్ వీడియో' పేరిట ఒక ఆసక్తికరమైన వీడియోను విడుదల చేశారు. సాధారణంగా హారర్ సినిమాలకు ట్రైలర్లు రావడం సహజం, కానీ ఇలా ప్రత్యేకంగా హెచ్చరిక వీడియో రావడం హారర్ జానర్‌లోనే ఇదే తొలిసారి. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఆత్మలు, దెయ్యాలు లేవని బలంగా నమ్మే కొందరు స్నేహితుల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. సమాజంలోని మూఢనమ్మకాలను, దొంగ బాబాలను ఎండగట్టాలని వారు భావిస్తారు. ఈ క్రమంలో వారికి పృథ్వీరాజ్ (బబ్లూ) నుంచి ఒక సవాలు ఎదురవుతుంది. 'ఆత్మలు ఉన్నాయని నిరూపిస్తే..?' అంటూ ఆయన విసిరే ఛాలెంజ్‌తో ఈ స్నేహితుల బృందం ఒక చీకటి ప్రపంచంలోకి అడుగుపెడుతుంది. మనుషుల్లాగే కొన్ని స్థలాలు కూడా పుట్టుకతోనే శాపగ్రస్తమై ఉంటాయి.. కాలక్రమేణా అవి ఆత్మలకు నిలయాలుగా మారుతాయని దర్శకుడు శ్రీనివాస్ మన్నె ఇచ్చిన వార్నింగ్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది. ట్రైలర్ మరియు ఈ వార్నింగ్ వీడియోలో కనిపించిన విజువల్స్ భయానకంగా ఉన్నాయి.



## సామాజిక సందేశంతో వస్తున్న దండోరా

గ్రామీణ నేపథ్యంలో సాగే సందేశాత్మక చిత్రాలకు తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ బ్రహ్మరథం పడతారన్న విషయం తెలిసిందే. తాజాగా అదే కోవలో తెలంగాణ సంస్కృతి, సామాజిక అంశాల కలబోతగా వస్తున్న చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నైజాం ఏరియాలో విడుదల చేస్తుండటం సినిమాపై మరింత అంచనాలను పెంచింది. విదేశాల్లో కూడా ఈ సినిమా భారీ ఎత్తున విడుదల కానుంది. సుమారు 200కు పైగా థియేటర్లలో ప్రదర్శితం కాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి, ఈ నెల 23నే అక్కడ ప్రీమియర్స్ పడనున్నాయి. అయితే ఈ సినిమా విడుదలకు ఇంకా వారం కూడా లేకపోవడంతో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. గ్రామాల్లో ఇంకా కులం అడ్డుగోడలు తొలగిపోలేదని ఈ ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతుంది. ప్రారంభంలోనే ఊరి బయట శవాన్ని మోసుకెళ్తున్న దృశ్యాలు, 'మన చావు పుట్టుకలన్నీ ఈ ఊరి బయట రాసిండ్రా ఆ దేవుడు..' అనే డైలాగ్ ఈ సినిమాలో ఉన్న సామాజిక కోణాన్ని ఎత్తి చూపుతోంది. ఈ చిత్రంలో శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మానికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందుమాధవి, రాధ్య, అదితి భావరాజు వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషించారు. మార్క్ కె. రాబిన్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. తెలంగాణ మట్టి వాసనతో కూడిన కథలను ఇష్టపడే వారికి 'దండోరా' ఒక మంచి అనుభూతిని ఇస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.






# వయోవృద్ధులకు న్యాయ సేవలు

**□ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమం, సంరక్షణ మన సామాజిక చట్టపరమైన బాధ్యత అని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ.నిర్మలా గీతాంబ తెలిపారు. వరంగల్ కలెక్టరేట్ లోని ఆర్డీఓ కార్యాలయంలో శనివారం వృద్ధుల సంక్షేమం కొరకు ఏర్పాటు చేసిన న్యాయ సేవల శిబిరాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలసి న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ఉచిత న్యాయ సేవా శిబిరం కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదన్నారు. ఇది మన ఇంట్లో ఉన్న వృద్ధులకు మనం ఇచ్చే భరోసా అన్నారు. వృద్ధులలో ఆత్మగౌరవం తగ్గకూడదని సూచించారు. నేటి సమాజంలో మారుతున్న జీవనశైలి కారణంగా చాలామంది వృద్ధులు ఒంటరితనానికి, నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వం 2007లో 'తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం' తీసుకొచ్చిందని గుర్తు చేశారు. వృద్ధులు పోషణ పొందే హక్కు, ఆస్తి రక్షణ, తక్షణ పరిష్కారం మొదలగు హక్కులు కలిగి ఉన్నారని వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే నిర్భయంగా న్యాయ సేవా శిబిరాన్ని సంప్రదించి, ఉచిత న్యాయ సలహాలు పొందాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ వృద్ధులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వారికి అవసరమైన న్యాయ సహాయం సకాలంలో అందించడమే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నదని, వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్, ఆర్డీఓ టి.సుమ, డీఏఓ ఫణి కుమార్, న్యాయవాది ఎస్.కుమార్, పారా లీగల్ వాలంటీర్ ఆలేటి డార్కస్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, వరంగల్ అధ్యక్షులు మల్లారెడ్డి, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, వయోవృద్ధులు పాల్గొన్నారు.

# డిజిటల్ చెల్లింపులకు కియోస్క్

**□ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి**

**వరంగల్ వాయిస్, నక్కలగుట్ట :** ప్రపంచం మొత్తం డిజిటలైజేషన్ వైపు మారుతున్న ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్క వినియోగదారుడు తమ నెల వారి కరెంట్ బిల్లులను ఆన్ లైన్ లో చెల్లించాలని టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి కోరారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ బిల్లుల చెల్లింపు కార్యాలయంలో యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఏర్పాటు చేసిన 'డిజిటల్ పేమెంట్ కియోస్క్' ను సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి అధికారికంగా ఆరంభించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ వినియోగదారులకు నగదు రహిత చెల్లింపు చేసేలా డిజిటల్ పేమెంట్ కియోస్క్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇక్కడకు వచ్చిన వినియోగదారులకు ఆన్ లైన్ లో బిల్లులు చెల్లించే విధంగా అవగాహన కల్పించేందుకు ఉద్యోగిని నియమించాలన్నారు. వినియోగదారులు ఇక్కడ అందుబాటులో ఉంచిన కియోస్క్ ద్వారా తక్కువ సమయంలో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని పేర్కొన్నారు. కియోస్క్ లో సంబంధిత విద్యుత్ బిల్లుపైన ఉన్న యూనిక్ సర్వీస్ నంబర్ నమోదు చేస్తే సంబంధిత వివరాలు కనిపిస్తాయని, అందులో పేమెంట్ ఆప్షన్ కు వెళ్లగానే క్యూఆర్ కోడ్ వస్తుందని, వినియోగదారుని మొబైల్లో యూపీఐ యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి బిల్లు చెల్లించవచ్చని అన్నారు. వినియోగదారులు ఇకపై నగదు తీసుకురావాల్సిన అవసరం లేదని, చిల్లర సమస్యలు, కౌంటర్ రద్దీ, వేచి ఉండే సమస్యలు పూర్తిగా తగ్గిపోతాయని తెలిపారు. యూనియన్ బ్యాంకు మద్దతుతో ఉద్యోగులకు కోటి రూపాయల బీమా అందిస్తున్నామని సీఎండీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఫైనాన్స్ వి.తిరుపతి రెడ్డి, సీజీఎం ఆర్.చరణ్ దాస్, జీఎం శ్రీనివాస్, వెంకట కృష్ణ, జయరాజ్, హనుమకొండ ఎస్ఏఓ నవీన్ కుమార్, డీఈ టెక్నికల్ విజయేందర్ రెడ్డి, హనుమకొండ టౌన్ డీఈ సాంబ రెడ్డి, యూనియన్ బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ జోనల్ హెడ్ ఎం.రవీంద్ర బాబు, డీజీఎం రీజినల్ హెడ్ గంటి కమలాకర్, వై.శ్రీకాంత్ కుమార్, ఏజీఎం, కార్పొరేట్ బిజినెస్ సెంటర్ హైదరాబాద్, డిప్యూటీ రీజినల్ హెడ్ మహేష్ , మేనేజర్ నక్కలగుట్ట కుందన్ కుమార్, రవి కుమార్ తదితర ఉద్యోగులు పాల్గొన్నారు .






# యువజ్యోతి కాలనీకి సీసీ రోడ్డు

**◆ శంకుస్థాపన చేసిన మంత్రి కొండా సురేఖ**
**◆ బిజీబిజీగా పర్యటన**

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** బల్దియా పరిధి 19 వ డివిజన్ కాశీబుగ్గ ప్రాంతంలోని యువ జ్యోతి కాలనీకి ఎట్టకేలకు మోక్షం లభించింది. రూ. 46.50 లక్షలతో సీసీ డ్రైనేజ్, రోడ్లకు శనివారం మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేశారు. కాగా కాలనీవాసులు యువ జ్యోతి కమిటీ హాల్ తోపాటు ఏకలవ్య కమిటీ హాల్ నిర్మించాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, 19వడివిజన్ కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్, కార్పొరేటర్ ఫుర్ఖాన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గోపాల్ నవీన్ రాజ్, దాసరి రాజేష్, గణిపాక సుధాకర్, దేవర ప్రసాద్, పద్మ గంగాధర్, గుండు శ్రీనివాస్, దిడ్డి సుదర్శన్, కుందారపు లక్ష్మీనారాయణ, కుందారపు గోపి, చింత కృష్ణ సిలువేరు రాజు, పల్లకొండ హరికుమార్, ఊరుగొండ రవీందర్, పాలకుర్తి హరిప్రసాద్, మేక మల్ల వెంకటేష్, జంగాలపల్లి రాజు, ఈఈ సంతోష్ బాబు, తహసిల్దార్ శ్రీకాంత్, వర్క్ ఇన్స్పెక్టర్ పుల్ల రాజు, పల్లకొండ శివ, మాదగాని సరోజన, చిమ్మని లత, పల్లకొండ కల్పన, పల్లకొండ రాజమణి, ఓని రజిత, దుగ్యాల భాగ్యమ్మ, కాలనీ వాసులు కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బల్దియా పరిధి 21 వ డివిజన్ తిలక్ నగర్ ప్రాంతంలో బల్దియా సాధారణ నిధులు రూ.45 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైన్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. శనివారం కూడా మంత్రి సురేఖ వివిధ శంకుస్థాపనలతో పాటు పలు కార్యక్రమాలకు హాజరై బిజీబిజీగా గడిపారు.

# జీటీఏ-మెగా కాన్ఫరెన్స్ ను విజయవంతం చేయండి

**□ మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు**

**వరంగల్ వాయిస్, హంటర్ రోడ్డు :** గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో ఫైనాన్స్ జిల్లా గండిపేటలోని అక్షయ కన్వెన్షన్ లో నిర్వహించ తలపెట్టిన వరల్డ్ మెగా కాన్ఫరెన్స్ గోడ పత్రికను వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు శనివారం ఆవిష్కరించారు. హనుమకొండలోని ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డ్ భవనం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ వాషింగ్టన్ డీసీ అధ్యక్షులు ముంద్రాతి రాము, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి విద్యం రాజగోపాల్, సీనియర్ జర్నలిస్ట్ వేముల సదానందం, వరంగల్ వాయిస్ డిజిటల్ ఈవెనింగ్ ఎడిషన్ ఛీఫ్ ఎడిటర్ గడ్డం కేశవ మూర్తి, గోపన్న, కుసుమ కిశోర్, పూజారి విజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు మాట్లాడుతూ విదేశాల్లో స్థిరపడిన ప్రవాస భారతీయులు పలు సంఘాలుగా ఏర్పడి సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. మనం ఎంత సుఖంగా బతికామన్నది ముఖ్యం కాదని, తోటి సమాజానికి సేవ, మేలు ఎంత చేశామన్నదే మనకు పేరు ప్రతిష్టలు తెచ్చి పెడుతుందన్నారు. గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల కార్యవర్గాలను ఏర్పాటు చేసి రెండు రోజుల పాటు సదస్సులు నిర్వహించి సామాజిక సేవా కార్యక్రమాలపై నిర్ణయం తీసుకోవడం నూతన పరిణామమని కొనియాడారు. జీటీఏ పేద విద్యార్థుల ఉన్నత చదువులకు, చేనేత కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడానికి కృషి చేయాలని వన్నాల శ్రీరాములు కోరారు. నార్త్ అమెరికా పద్మశాలి సంఘం (నాపా) వ్యవస్థాపకుల్లో తాను ఒకడినని, అయితే నాపా ద్వారా చేనేత కార్మికులకు ఆసు యంత్రాలు,పేద విద్యార్థులకు స్కాలర్ షిప్ లు అందించడంతో ఎంతో మందికి ప్రయోజనం చేకూరుతుందని వన్నాల తెలిపారు. ప్రతిష్ఠాత్మకంగా ఫైనాన్స్ జిల్లా గండిపేటలోని అక్షయ కన్వెన్షన్ లో నిర్వహిస్తున్న గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ సదస్సుకు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని వన్నాల కోరారు.



# కాటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ గా 'బొమ్మినేని'

**□ ముంబై కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ**

(మొదటి పేజీ తరువాయి..) 2025–2026 సంవత్సరమునకు సేవా భావంతో మార్గ నిర్దేశనం చేసేందుకు కొత్త కమిటీ అధ్యక్షులుగా వినయ్ ఎన్. కోటక్, అసోసియేట్ డైరెక్టర్ గా బొమ్మినేని రవీందర్ రెడ్డిని ఎన్నుకున్నారు. బహుళ ప్రాముఖ్యం కలిగిన డైరెక్టర్ పదవిని బొమ్మినేని రవీందర్ రెడ్డి ముంబై కాటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో శుక్రవారం చేపట్టారు. నూతన కమిటీకి కాటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పూర్వ అధ్యక్షులు అతుల్ ఎస్.గనత్రా వారి కార్యవర్గంతోపాటు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లలిత్ కుమార్ గుప్తా, తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కక్కిరాల రమేష్, ఇతర రాష్ట్రాల కాటన్ అసోసియేషన్ల ప్రతినిధులు, వారి కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలియజేశారు. వీరి పదవీ కాలంలో కాటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అన్ని వర్గాలకు మేలు చేసే విధంగా మార్గదర్శనం చేసి సంస్థకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com